క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్ విక్రమ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గాజువాక బీసీ రోడ్డుకు చెందిన ఎస్.నరసింహమూర్తి శనివారం లక్ష 116 రూపాయల విరాళం అందజేశారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటర్‌లో సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్‌ను ప్రోటోకాల్ విభాగం సూపరింటెండెంట్ విక్రమ్ అందజేశారు. అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

అప్పన్న దేవస్థానంలో ఉద్యోగులకు పదోన్నతులు



శ్రీనివాస్ సాయికి పదోన్నతి పత్రం అందజేస్తున్న ఈవో సుజాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న కోరాడ శ్రీనివాస్‌సాయి, టి.రేవతిలకు సీనియర్ అసిస్టెంట్లుగా, రికార్డు అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఎస్.బాలభాస్కర సాయి, ఎస్.ప్రశాంత్‌లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు దేవస్థానం కార్యాలయంలో ఇన్‌చార్జి ఈవో ఎస్.సుజాత వారికి పదోన్నతి పత్రాలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో వి.బి.వి.రమణమూర్తి, డీఈ డీవీఎస్.రామరాజు, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పినగాడిలో కొండచిలువ కలకలం



పినగాడిలో కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్ బృందం

పెందుర్తి: మండలంలోని పినగాడి పొలాల్లో భారీ కొండచిలువ కలకలం రేపింది. వివరాలివి.. గ్రామానికి చెందిన సురపనేని సుబ్రహ్మణ్యం పొలాల్లో రెండు రోజులుగా భారీ పాము తిరుగుతున్నట్లు స్థానికులు గుర్తించారు. దీనిపై నగరానికి చెందిన స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. శనివారం ఉదయం కిరణ్ తన రెస్క్యూ టీంతో కలిసి పినగాడి పొలాల్లో సంచరిస్తున్న కొండచిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. కొండ చిలువతో పాటు దాని గుడ్లను నగరంలోని కంబాలకొండ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు. కాగా పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో భారీ కొండచిలువ సంచారంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

కథలతో వ్యక్తిత్వ వికాసం



వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: కథలతో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి బి.సూర్యకళ అన్నారు. నీతి కథలు పిల్లల్లో విలువలను పెంపొందిస్తాయన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు నీతి కథను బోధించారు. అనంతరం సామూహిక పుస్తక పఠనం చేయించారు. ఇంగ్లిష్ నేర్పించారు. బాస్కెట్-ఫ్లవర్ ఆట ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ అనంతరం ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

నరకానికి నకళ్లు.. ఆ రహదారులు



అదుపు తప్పితే అంతే: గోతులమయంగా వేపగుంట-పినగాడి రోడ్డు

- వేపగుంట-పినగాడి రోడ్డులో అడుగుకో గొయ్యి.. మీటరుకో గుంత
- శిథిలావస్థకు చేరిన పెందుర్తి-జుత్తాడ రహదారి
- అక్కిరెడ్డిపాలెం-సింహాచలం రోడ్డు గోతులమయం
- సబ్బవరంలో అధ్వానంగా మారిన మారిటైం యూనివర్సిటీ మార్గం
- దారి పొడవునా గోతులు, రాళ్లు తేలి వాహన చోదకుల అవస్థలు

పెందుర్తి: 'రెండు మూడు రోజుల్లో వేపగుంట-పినగాడి రోడ్డు పనులు ప్రారంభిస్తాం. ముందుగా జీవీఎంసీ పరిధిలో ఉన్న రోడ్డును పూర్తి చేస్తాం. తర్వాత కొద్ది రోజుల్లోనే మిగిలిన రోడ్డు పనుల ప్రక్రియ ప్రారంభిస్తాం. అతి త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం. అదే విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి చేయాల్సిన రోడ్లు అన్నీ పూర్తి చేస్తాం. ఏడాది తిరిగేలోపు రోడ్ల సమస్య లేకుండా చేస్తాం'. కూటమి అధికారంలోకి వచ్చిన గత ఏడాది జూన్ 27న వేపగుంట-పినగాడి రహదారిని పరిశీలించిన సమయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు వ్యాఖ్యలు ఇవి. కానీ దాదాపు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనకు దగ్గరవుతోంది కానీ నియోజకవర్గంలోని అనేక రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. ఎమ్మెల్యే పంచకర్ల హామీ ఇచ్చినట్లుగా రోడ్ల నిర్మాణాలు కాదు కదా కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఉదాహరణకు అడుగుకో గొయ్యి ఉన్న వేపగుంట-పినగాడి రహదారిపై మట్టితో గోతులు పూడ్చలేదు. ఇక రంపపు కోతకు గురైన అక్కిరెడ్డిపాలెం-అడవివరం రోడ్డు, పెందుర్తి-జుత్తాడ రోడ్డు, సబ్బవరం మండలం ఆరిపాక నుంచి వంగలి సమీపంలో మారిటైమ్ యూనివర్సిటీ ప్రధాన రోడ్డును పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు ఆక్షేపిస్తున్నారు.

➡ పది కిలోమీటర్ల మేర ఉండే వేపగుంట-పినగాడి రహదారి 60 అడుగుల విస్తీర్ణం కాగా ప్రస్తుతం 18 అడుగుల రోడ్డు ఉంది. అయితే ఇది శిథిలావస్థకు చేరుకోవడం.. రోడ్డు విస్తీర్ణం తక్కువ ఉండడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం ఉన్న 18 అడుగుల రోడ్డుకు అదనంగా ఇరువైపులా ఐదు అడుగులు పెంచుతూ మొత్తం 23 అడుగుల రోడ్డు నిర్మాణం, మరో 12 అడుగుల మట్టి కప్పడానికి రూ.15 కోట్ల నిధులు మంజూరు చేశారు. అప్పట్లో కల్వర్టుల నిర్మాణంతో పాటు రోడ్డు వెడల్పు చేసేందుకు మెటల్ కూడా వేయడం ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్ (ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్యే) ఆఖరి నిమిషంలో పనులు చేసేందుకు నిరాకరించడంతో రోడ్డు పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. తర్వాత ఎన్నికలు రావడంతో శాశ్వతంగా రోడ్డు విస్తీర్ణం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల తర్వాత మీడియాతో మాట్లాడిన స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మూడు నెలల్లో ఈ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. కానీ ఇప్పటికీ అతీగతీ లేదు. పలు వివాదాల తర్వాత వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో ఈ రోడ్డు విస్తరణ చేపడతామని ప్రకటించింది. ఆ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో కూటమి ప్రజాప్రతినిధుల వద్ద కూడా సమాధానం లేదు.

➡ పెందుర్తి-పులగానిపాలెం-జుత్తాడ రహదారి వేలాది మంది రాకపోకలు సాగించే రోడ్డు. దాదాపు 10 ఊళ్లను మండల కేంద్రం పెందుర్తికి దగ్గర చేస్తుంది. అంతా బాగుంటే నిమిషాల్లో పట్టణానికి చేరుకోవచ్చు. కానీ ఆ రోడ్డు నిర్మాణానికి గ్రహణం వీడలేదు. రోడ్డు పరిస్థితి తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీని నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు కేటాయించింది. కానీ కొన్ని సాంకేతిక కారణాలు, తర్వాత ఎన్నికలు రావడంతో టెండర్ దశలోనే నిలిచిపోయింది. తాజాగా కూటమి ప్రభుత్వం రేపు మాపు అంటూ తొమ్మిది నెలలు గడిపింది కానీ రోడ్డు బాగుపడలేదు. ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డు నిర్మాణానికి ముందుకు రావాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.



కోరుకుపోయిన అంచులు





అక్కిరెడ్డిపాలెం-సింహాచలం రహదారి దుస్థితి



పెందుర్తి-అక్కిరెడ్డిపాలెం-జుత్తాడ-అడవివరం రహదారి వేలాది మంది రాకపోకలు సాగించే రోడ్డు. దాదాపు 15 ఊళ్లను పెందుర్తి నుంచి అడవివరం /సింహచలానికి దగ్గర చేస్తుంది. జంగాలపాలెం, నరిపల్లి, ముదపాక, గుర్రంపాలెం, బొడ్డునాయుడుపాలెం, అక్కిరెడ్డిపాలెం, పీఎస్ఎల్, రాయవరపువానిపాలెం తదితర గ్రామాల నుంచి సింహాచలం రోడ్డుకు నిమిషాల్లో చేరుకోవచ్చు. కానీ ఆ రోడ్డు నిర్మాణానికి గ్రహణం వీడలేదు. రోడ్డు పరిస్థితి తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీని నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు కేటాయించింది. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో 80 అడుగుల రోడ్డు ప్రతిపాదన ఉన్నప్పటికీ ప్రస్తుతం 30 అడుగుల రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల అయ్యాయి. కానీ కొన్ని సాంకేతిక కారణాలు, తర్వాత ఎన్నికలు రావడంతో టెండర్ దశలోనే నిలిచిపోయింది. ప్రస్తుతం ఈ రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. ఇటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ముఖ్యంగా ఆటోలు, బైక్‌లు పాడవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.



పూర్తిగా శిథిలమైన పెందుర్తి-జుత్తాడ రోడ్డు

చాలా ఇబ్బందులు పడుతున్నాం..



మారిటైం యూనివర్సిటీకి వెళ్లే మార్గం చాలా గ్రామాలను కలుపుతుంది. దీంతో నిత్యం ఈ రోడ్డులో వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. మాకు కూడా ఇదే ప్రధాన మార్గం. అయితే రోడ్డు పూర్తిగా పాడవడం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయి. వర్షాలు పడితే మా పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.

– ఆదారి వెంకటరమణ, రాయపుర అగ్రహారం, సబ్బవరం మండలం

నిత్యం ప్రమాదాలే..



పినగాడి-వేపగుంట రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఏజెన్సీ, అనకాపల్లి, దేవరాపల్లి ప్రాంతాల నుంచి మంత్రులు, ఇతర పెద్దలు నగరానికి వెళ్లడానికి ఈ మార్గాన్నే ఉపయోగిస్తారు. కానీ ఈ రోడ్డులో అడుగుకో గొయ్యి ఉంది. ఏడాది క్రితం రోడ్డు వేస్తామని చెప్పారు. ఆ తర్వాత 150 అడుగుల రోడ్డు అన్నారు. ఇటీవల 70 అడుగుల రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు. ఇలా కాలయాపన చేయడం వల్ల వాహనచోదకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గోతుల కారణంగా నిత్యం ఈ మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– బి.నాయుడు, పినగాడి, పెందుర్తి మండలం

దుస్థితిలో ఆరిపాక-వంగలి రోడ్డు

సబ్బవరం మండలం ఆరిపాక నుంచి వంగలి మీదుగా మారిటైం యూనివర్సిటీకి వెళ్లే మార్గం పూర్తిగా దెబ్బతింది. భారీ వాహనాలు ఈ రోడ్డులో నిత్యం రాకపోకలు సాగించడంతో పూర్తిగా గోతులమయమైంది. దీంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు పాడవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆయా రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.



సబ్బవరం మండలం ఆరిపాక నుంచి మారిటైం రోడ్డు దుస్థితి



రాళ్లు తేలిన వెంకటాపురం రహదారి



గోతులమయంగా మారిన పెదముషిడివాడ-సబ్బవరం రహదారి



అధ్వానంగా మారిన మెట్టపాలెం రహదారి

అడుగడుగునా గుంతలే..

పరవాడ: మండలంలో రహదారులు దారుణంగా ఉన్నాయి. వాడచీపురుపల్లి- వెంకటాపురం రోడ్డు చూస్తే వణుకు పుడుతుంది. ఈ రహదారిలో ప్రయాణించే వెంకటాపురం, నునపర్తి, గొల్లగుంట, రేకవానిపాలెం, రావాడ గ్రామాల ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. కనీసం వీధి దీపాలు కూడ లేక రాత్రి సమయంలో పలువురు గాయాలపాలవుతున్నారు.

➡ నాయుడుపాలెం శివారు మెట్టపాలెం రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. ఈ మార్గంలో మెట్టపాలెం, పాతరాజన్నపాలెం, కొల్లివానిపాలెం గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగించే రైతులు, విద్యార్థులు, కార్మికులు అవస్థలు పడుతున్నారు.

➡ పెదముషిడివాడ-సబ్బవరం రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలు ప్రయాణికుల ప్రాణాలను హరిస్తున్నాయి. ఈ రోడ్డును అభివృద్ధి చేస్తామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా నేటి వరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. గుంతలమయంగా మారిన రహదారిలో కనీసం వీధి దీపాలు కూడా లేక చీకటిపడితే గుంతలను తప్పించుకోలేక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

నిత్యం నరకం చూస్తున్నాం



మెట్టపాలెం రోడ్డంతా రాళ్లు తేలిపోయి నిత్యం నరకం చూస్తున్నాం. వర్షాలు పడితే రోడ్డు మరింత దారుణంగా మారుతుంది. వర్షం నీటితో గోతులు నిండిపోయి రాత్రి వేళ రాకపోకల సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నాం. దారుణంగా మారిన రోడ్డు బాగు చేయాలి.

– రామిడి కృష్ణ, స్థానికుడు, మెట్టపాలెం

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న బాలికలు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో 6,7,8 తరగతుల విద్యార్థినులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ నెల 2వ తేదీన ప్రారంభించిన ఈ శిబిరంలో శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖ, అనకాపల్లి, యలమంచిలి, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి వచ్చిన సుమారు 30 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. వీరు శిక్షణ శిబిరంలో నేర్చుకున్న విద్యను, సంస్కృత భాషలో అబ్బిన ప్రావీణ్యాన్ని ముగింపు కార్యక్రమంలో ప్రదర్శించారు. గణితశాస్త్ర ప్రత్యేక సూత్రాలు, దేవమంత్రాలలోని మేధా సూక్తం, మంత్రపుష్పం, తెలుగు చందస్సును శిబిరంలో అభ్యసించారు. అదే విధంగా యూఎస్‌లోని టెక్సాస్‌కు చెందిన ఎక్సెస్ కాన్షియస్‌నెస్ సంస్థ బెంగళూర్ చాప్టర్ నుండి వచ్చిన మైసూర్ మంజునాథ, విశాఖకు చెందిన షణ్ముఖ, సాఫ్ట్‌వేర్ సంస్థ అధినేత శ్రీహర్ష ఈ చిన్నారులకు ప్రోత్సాహం అందిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారపాడు సర్పంచ్ మామిడి శంకరరావు, ప్రభాకర్, కందర్ప రమ తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం



సభలో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ లీగల్: వివిధ కారణాల వల్ల తప్పిపోయిన బాలలకు న్యాయ సహాయం అందించేందుకు విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ సిద్ధంగా ఉందని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఉదయం విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా ప్రాధికార సంస్థ సమావేశ మందిరంలో తప్పిపోయిన బాలల దినోత్సవం నిర్వహించారు. నగర పోలీసు విభాగం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమాంతర న్యాయ సేవా సహాయకులు, ఇతర ప్రభుత్వ శాఖల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సన్యాసినాయుడు మాట్లాడుతూ తప్పిపోయిన బాలలకు పోలీసులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, లోక్ అదాలత్ ఉచితంగా సేవలందిస్తాయన్నారు. ఇందుకు సంబంధించి సమాచారాన్ని తమ కార్యాలయంలో పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ మేజిస్ట్రేట్ 1 రామచంద్రరావు, ఏసీపీ (క్రైం) డి.లక్ష్మణరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.వి.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయునికి ఆశ్రయం

పెందుర్తి: అనారోగ్యానికి గురై కుటుంబ సభ్యుల నిరాదరణకు గురైన ఓ వ్యక్తికి పెందుర్తి పోలీసులు ఆశ్రయం కల్పించారు. వివరాలివి.. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు కురువాడ గ్రామానికి చెందిన పేరూరి వరహాలు (40) అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో సంరక్షణ కొరవడడంతో ఇంటి నుంచి బయటికి వచ్చి పెందుర్తిలోని బస్టాండ్‌లో ఉంటున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ కె.వి. సతీష్‌కుమార్ వరహాలకు లయోలా వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించేందుకు ఆశ్రమ వ్యవస్థాపకుడు డి.ప్రకాశరావుతో మాట్లాడి తగిన చర్యలు తీసుకున్నారు. బ్లూకోట్స్ పీసీ చంద్రశేఖర్ శనివారం అతన్ని లయోలా ఆశ్రమానికి అప్పగించారు.



వరహాలును లయోలా ఆశ్రమానికి అప్పగిస్తున్న పీసీ చంద్రశేఖర్

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం: యోగాతో శారీరక దృఢత్వం, మానసిక వికాసం కలుగుతాయని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగాంధ్ర-2025లో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే నెల 21 వరకు నెల రోజుల పాటు యోగా పై ప్రతీరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, డాక్టర్ ఎం.రత్నప్రకాష్, డాక్టర్ లెక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎంవో డాక్టర్ ఉష

అగనంపూడి: రక్తదానం చేయడానికి యువత, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ పి. ఉష అన్నారు. అగనంపూడి ఏరియా ఆస్పత్రి, అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి సంయుక్తంగా అగనంపూడి ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోడానికి యువత దయార్ద్ర హృదయంతో ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. రక్తదానంపై అపోహలు విడనాడి రక్తదానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి రక్త నిధి ఇన్‌చార్జి డాక్టర్ కె.సంతోషి రూపా, డాక్టర్ భక్తవత్సల్య, డాక్టర్ అహమ్మద్, విశాఖ లయన్స్‌క్లబ్ చైర్‌పర్సన్ కిడిమి హనుమంతురావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కరణం సత్యారావు, సింగిడి సింహాచలం, అండిబోయిన మంగరాజు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

- కనులపండువగా నిత్యకల్యాణం
- విశేషంగా గరుడసేవ



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్నఅర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆలయ బేడామండపంలో శనివారం గరుడసేవను ఘనంగా జరిపించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని వెండి గరుడవాహనంపై కొలువుదీర్చి, అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అనంతరం హారతి ఇచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

గొల్లలపాలెం పంచాయతీ కార్యదర్శి రమేష్ సస్పెన్షన్



పంచాయతీ కార్యదర్శి రమేష్

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఎస్. రమేష్‌ను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం గొల్లలపాలెం పంచాయితీ కార్యదర్శి (గ్రేడ్-1)గా పని చేస్తున్న ఆయన అసకపల్లి పంచాయతీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో కోటపంచాయతీ కారదర్శిగా పని చేస్తున్నప్పుడు ప్రభుత్వ ఆదేశాల ఉల్లంఘన, నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అభియోగంపై పంచాయతీ రాజ్ కమిషనర్ ఆయనను సస్పెండ్ చేశారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు జిల్లా పంచాయతీ అధికారి నుండి సబ్బవరం ఎంపీడీవోకు అందాయి. రమేష్ సోమవారం నుండి సెలవులో ఉన్నారు.

శ్రీవారి అన్న ప్రసాదానికి విరాళం అందజేత

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్బీఐ ఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో అన్న ప్రసాద మూలనిధికి దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో షీలానగర్‌కు చెందిన శోభారాణి, అశ్విని కుమార్, గణపతి, లక్ష్మి రూ.25 వేలను శనివారం తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు.